# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# అమ్మ - మరుజన్మ

ఐఫిల్ టవర్ దగ్గర ఉన్న పార్క్ లో కూర్చొని ఉన్నారు ఆ నలుగురూ. అందరూ ఏదో తీవ్రమైన ఆలోచనలో ఉన్నట్టుగా కనిపిస్తున్నారు.

" ఏమైతే అయిందని నేను నిన్ననే ఫేస్ బుక్ లో పోస్ట్ చేశాను, చూద్దాం ఏమవుతుందో? " అన్నాడు నికోలస్.

" ఓ,? దట్స్ గుడ్" అన్నాడు మాటీస్.

నీనా, రెనీ మౌనంగా కూర్చున్నారు. " మీరిద్దరూ ఇలా మాట్లాడకుండా కూర్చుంటే ఏమీ జరగదు" కోపంగా అన్నాడు నికోలాస్.

" నిక్, చిల్! వాళ్ళకి కొంత సమయం కావాలి, ఆలోచించుకుని చెప్తారు లే!" అన్నాడు మాటీస్. వాళ్ళ సంభాషణంతా ఎక్కువగా ఫ్రెంచ్ లోనూ, మధ్య మధ్యలో ఇంగ్లీష్ లోనూ జరుగుతోంది.

" ఇంకా ఎన్నో రోజులు ఇలా ఉండడం నా వల్ల కాదు, నిజం తెలియాలి. మీకెలావుందో, నాకు తెలియదు కానీ నాకు మాత్రం చాలా కష్టంగా అనిపిస్తోంది" అన్నాడు మళ్ళీ నికోలాస్.

" నువ్వు ఇంతగా చెప్తుంటే నాకూ అనిపిస్తోంది, ఐ థింక్ ఐ యాం రెడీ" నీనా అంది.

“ దేర్ యూ గో, ఇప్పుడు దారిలోకి వస్తున్నావు. ఇలా ఉండడం నిజంగా హెల్" అన్నాడు నికోలస్ చిరాగ్గా.

" సమ్మర్ లో ప్లాన్ చేద్దామా? మాటీస్ అన్నాడు.

"యా, నేను రెడీ.. అన్నాడు నికోలాస్.

"నేను కూడా" అంది నీనా.

రెనీ మాత్రం ఇంకా ఏమీ మాట్లాడడం లేదు. ఆమె ముఖంలో ఏదో తెలియని చిన్న బాధ.

" ఏమయింది రెనీ? ఓకేనా?" అడిగాడు మాటీస్.

"నాకు కొంత సమయం కావాలి ఆలోచించుకోవడానికి" అంది బెరుగ్గా.

" బ్రేక్ ఇంకా చాలా దూరం ఉందిగా, అప్పటిలోపల ఆలోచించు" అంది నీనా సర్ది చెప్తున్నట్టుగా.

" ప్లీజ్ డోంట్ టేక్ లాంగ్, లేకపోతే మిగిలిన ఏర్పాట్లన్నీ ఇరుకులో పడతాయి " అన్నాడు నికోలస్ చిరుకోపంతో.

" ఓ. కే " అంది రెనీ నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"సరే, వినండి, మనం ఈ లోపున చాలా పనులు చెయ్యాలి, అంటూ ఎవరెవరు ఏం చెయ్యాలో? మళ్ళీ ఎప్పుడు, ఎక్కడ కలవాలో?" చెప్పాడు నికోలస్.

అందరూ 'సరే' అన్నట్టుగా తలలూపారు. తొందరలోనే మళ్ళీ కలుద్దాం అంటూ విడిపోయారు నలుగురూ.

-----------  –

దగ్గరలోని ట్యూబ్ ( రైలు) స్టేషన్ వైపుకి గబ గబా నడుస్తోంది రెనీ. అంతకంటే వేగంగా సాగుతున్నాయామె ఆలోచనలు. ' ఎక్కడివాళ్ళం తాము నలుగురూ? ఇక్కడ ఎలా కలిసాం?' అనుకుంటేనే ఆమెకి ఆశ్చర్యంగా ఉంది.

' తను పారిస్ ఎప్పుడు వచ్చిందో తెలీదు, తెలిసిందల్లా తనూ, అమ్మ ఏగ్నెస్. అదే తన కుటుంబం. మదర్ థెరీసా అసలు పేరు కూడా ఏగ్నెస్, అమ్మ కూడా అంత మంచిది. చిన్నప్పటినించీ తననెప్పుడూ ఎంతో ప్రేమగా , ప్రాణంగా చూసుకునేది. ఎంత మంచి మనసు కాకపోతే ఎక్కడ పుట్టిందో తెలియని తనను తీసుకుని వచ్చి ' రెనీ' అంటే 'తిరిగి పుట్టినది లేదా మరు జన్మ' అన్న అర్థవంతమైన పేరు పెట్టి అల్లారుముద్దుగా పెంచుతుంది? ఇప్పుడా అమ్మని వదిలి వెళ్ళడమనే ఊహే తనకి ఎలాగో ఉంది. తన వల్ల అమ్మ పడిన ఇబ్బందులూ, అవమానాలూ అన్నీ గుర్తున్నాయి తనకి. ఆ మాటకొస్తే తనూ ఎన్నో భరించింది అచ్చం తన ముగ్గురు స్నేహితుల్లాగే. ఎందుకంటే వాళ్ళూ తనలాగే భారతదేశం నించి దత్తత చేసుకుని తీసుకురాబడ్డవారే కనక.

అందరికథలూ దాదాపుగా ఒకటే. స్వంత ఊరేదో, స్వంత వారెవరో తెలియకుండా ఇక్కడ వారితో కలవలేక, 'వారు కలుపుకోక' అనడం సరైనదేమో అందరూ ఒకేలాంటి అనుభవాలని చవిచూసిన వారే. అలాంటివేవీ మర్చిపోలేదు తను.

" అమ్మా, నా జుట్టు నీలా గోల్డెన్ కలర్ లో కాకుండా ఇలా జెట్ బ్లాక్ గా ఎలా ఉంది? నా కళ్ళు కూడా నల్లగా ఉన్నాయే? రోజూ నా క్లాస్ మేట్ లోలిటా అడుగుతూ ఉంటుంది. ఏం చెప్పను?" తనకి ఆరేళ్ళుంటాయేమో ఆ ప్రశ్న తల్లి ని అడిగినప్పుడు.

అమ్మ పక పకా నవ్వింది ఆ మాటలకి. తనకెంత ఉక్రోషం వచ్చిందో అప్పుడు. " ఎందుకు నవ్వుతోంది అమ్మ? అని " అదే మాట అడిగింది.

" అదా! చాలా చిన్న విషయం, నేను ఇండియా వెళ్ళినప్పుడు అక్కడ గాడ్ ని ప్రార్థిస్తే. గాడెస్ లా అందంగా ఉన్న నువ్వు దొరికావు " అంది అమ్మ తన బుగ్గన ముద్దు పెట్టుకుంటూ.

" అదా విషయం! నౌ ఐ గాటిట్. రేపు చెప్తాను లోలిటాకి" అంది తను కూడా నవ్వుతూ.

కానీ అది నిజం కాదని కొద్దిరోజుల్లోనే అర్థం అయింది. కారణం తన తొమ్మిదో పుట్టినరోజునాడు అమ్మ తనని డిన్నర్ కి తీసుకెళ్ళినప్పుడు చెప్పిన అసలు విషయం. 'తనకి పిల్లలంటే ఎంతో ఇష్టమనీ, తన సోషల్ వర్క్ ప్రోజెక్ట్ పనిమీద ఇండియా వెళ్ళినప్పుడు అక్కడ ఆంధ్రాలోని ఒక అనాథాశ్రమంలో తనని చూసి ఎంతో ఇష్టపడి తెచ్చుకుందనీ'. తన అసలు అమ్మ ఎవరో? ఎలా ఉంటుందో? లాంటి వివరాలేవీ చెప్పలేదు.

" రెనీ డార్లింగ్, నీకిప్పుడు పది సంవత్సరాలు వచ్చాయి కనక, నీదగ్గర ఏమీ దాచకూడదు కనక, నిజాన్ని చెప్తున్నాను. మా అమ్మ పోయిన తర్వాత నేను ఎంతో ఒంటరితనంలో ఉండగా నా జీవితంలోకి వచ్చిన ఆశారేఖవి నువ్వు. ఈ తొమ్మిదేళ్ళలోనూ నువ్వు నాకు అందించిన ఆనందాన్ని మాటల్లో చెప్పలేను బంగారం. నీకు తెలిసిన ఈ నిజం వల్ల మనిద్దరి బంధంలో గానీ, భావనల్లో కానీ ఏ మార్పూ రాదు. నువ్వెప్పటికీ నా లవ్లీ ఏంజల్ వే. నిజానికి రెనీ అన్న పేరు నీకెందుకు పెట్టానో తెల్సా, నువ్వు నేను కనకుండానే , నాకు మరు జన్మనిచ్చిన దేవతవి కనక" అంది.

అమ్మ నీలికళ్ళ నిండా నీళ్ళు. ఆ విషయం విన్నాకా ఒక్క నిమిషం తనేమీ మాట్లాడలేకపోయింది.

" నో, మీ అమ్మ నీతో తమాషా చేస్తోంది, దీంట్లో ఏదో ఉంది" లోలిటా మాటలు వెక్కిరిస్తున్నా సరే అమ్మ అంటే ఇష్టం పెరిగిందే తప్ప కోపం రాలేదు.

" నీ వాళ్ళ దగ్గరనించి తీసుకొచ్చేశానని నీకు నామీద కోపం లేదుగా బంగారూ" అమ్మ అడుగుతూ ఉంటే తనూ కళ్ళ నిండా నీళ్ళతో తల అడ్డంగా ఊపింది. వెంటనే పట్టలేని ప్రేమతో అమ్మని గట్టిగా హత్తుకుపోయింది.

" పిచ్చీ!, వదులు, ఏమిటిది? ఇది రెస్టారెంట్ తెల్సా!" అంటూ అమ్మ నవ్వింది.

ఆ అందమైన నవ్వు, అమ్మ ముఖం... ఆ సంఘటన జరిగి, పదకొండేళ్ళు కావస్తోంది.

" తన అసలు అమ్మ ఎలా ఉంటుంది? తనకో కుటుంబం ఉందా? ఇండియాలో ఎక్కడ ఉంటారు వాళ్ళు? ఇండియా ఎక్కడ ఉంది? ఆంధ్రా అంటే ఎక్కడ " ఇలాంటి ఎన్నో ప్రశ్నలు తనను తరచూ కలవరపెట్టినా కానీ, అవి ఎప్పుడూ అమ్మకంటే పెద్దవిగానూ, గొప్పవిగానూ అనిపించలేదన్నది మాత్రం నిజం.

తానూ, అమ్మా, తమ సింగిల్ బెడ్ రూం ఫ్లాట్, బాల్కనీ, దాంట్లో తాము ఎంతో ప్రేమగా పెంచుకునే పెట్యూనియా మొక్కలూ. అమ్మ చేసే ఫ్రెంచ్ టోస్ట్, ఎప్పుడైనా అమ్మకి తెలియకుండా వేసుకునే అమ్మ టీ షర్టూ. అన్నీ అన్నీ ఎంతో మధురమైనవే తన జీవితంలో. తన ఈ కొత్త స్నేహితులు కలిసేవరకూ తనకి జీవితం పట్ల ఏ రకమైన అసంతృప్తి కానీ, ఫిర్యాదులు కానీ లేవు.

నికోలస్, మాటీస్, నీనా తనూ ఒకే క్లాస్. అది కాదు తమని కలిపింది. పేర్లు ఫ్రెంచివారివి, రూపాలు మాత్రం వేరు. అందరిదీ ఒకే పరిస్థితి అని తెలుసుకోవడానికి ఎక్కువ కాలం పట్టలేదు వాళ్ళకి.

నికోలస్ కి ఇద్దరు తమ్ముళ్ళూ, ఒక చెల్లీ ఉన్నారు. అతనిని తాము ఇండియానించి దత్తత తెచ్చుకున్నామని, అప్పటివరకూ పిల్లలు లేక ఎంతో వెంటనే మిగిలిన ముగ్గురూ పుట్టారనీ అతనికి తన పధ్నాలుగో పుట్టినరోజున చెప్పారుట. ఆ విషయం తెలిసిన నాటినించీ నికోలస్ ఎందుకో ముందులా ఉండలేకపోతున్నాడుట. అతనికి తన అసలు తల్లితండ్రులెవరో తెలుసుకోవలన్నది బలమైన కోర్కె. ఇండియన్ కల్చర్, పురాణాలూ అవి

చదువుతూ ఉంటే, నాకెంతో సంతోషంగా అనిపిస్తోంది. మనం ఎక్కడ పెరిగినా మన రూట్స్ మనల్ని తమ దగ్గరకే లాక్కువెళతాయేమో! అసలు మనం అక్కడే ఉంటే తెలుగు మాట్లాడేవాళ్ళమేమో. అంటాడు.

మాటీస్ ది మరో కథ. అతని అమ్మా, నాన్నా కూడా సోషల్ వర్కర్స్. ఎప్పుడో వెళ్ళిన ఇండియా ట్రిప్ లో ఇతన్ని తెచ్చుకున్నారుట. అప్పటికి వారిద్దరికీ పెళ్ళి కాలేదు. ఆ తర్వాత నాలుగునెలలకి పెళ్ళి చేసుకున్నారుట. చిత్రంగా హనీమూన్ కి కూడా అతన్ని తమ వెంట తీసుకెళ్ళారుట. అవన్నీ చెప్పి ఇప్పటికీ నవ్వుతాడు. అతనికి కూడా తన స్వంత తల్లితండ్రులని కలుసుకోవాలన్న ఆశ.

నీనా వాళ్ళింట్లో మొత్తం తొమ్మిది మంది. ఏడుగురు పిల్లలు. పెద్దవాళ్ళు ఐదుగురూ ఇలా రక రకాల చోట్లనించీ దత్తత చేసుకున్నవారే. అందరికీ అన్నీ చాలా చిన్నప్పుడే చెప్పేశారుట వాళ్ళ అమ్మా, నాన్నా. అందరూ చాలా సరదాగా ఉంటారు. కలిసి ఆడుకుంటారు సంగీతం పాడుకుంటారు. వాళ్ళ ఇల్లు ఎప్పుడూ హడావిడిగా, సందడిగా ఉంటుంది. వీలున్నప్పుడు తప్పకుండా మీ అసలు అమ్మలని చూపిస్తాం అని చెప్పారుట కూడ.

దాదాపు ఆరు నెలల క్రితం , నికోలస్ తెచ్చాడు ఈ ప్రస్తావన. " మనం అందరం ఇండియా వెళ్ళి మన అసలు అమ్మా, నాన్నలని వెతికితేనో? " అని.

" ఎందుకు? మనం బాగానే ఉన్నాము కదా? ఇప్పుడేమిటి అవసరం" అంది నీనా వెంటనే.

" నీ అమ్మెవరో నీకు తెలుసుకోవాలని లేదూ? నువ్వు పుట్టిన దేశం ఎలా ఉంటుందో చూడాలని లేదూ? ఇక్కడ ఎవరిదయమీదనో బ్రతుకుతున్నామని అనిపించడం లేదూ?" అన్నాడు ఆవేశంగా. అతనిది మొదటినించీ దుడుకు మనస్తత్వం. పైగా అతనికి తాను దత్తపుత్రుడిననే విషయం చాలాకాలం దాచారని తన తల్లి తండ్రులమీద కోపం కూడా.

" ఉందనుకో, కానీ అదంత ఈజీ కాదు కదా. మనకి వీసాలు అవీ ఎవరు ఏర్పాటు చేస్తారు? " అంది నీనా.

" అదీ నిజమే, నిక్. తగినంత సమాచారం లేకుండా ఎక్కడికీ వెళ్ళలేం. వెళ్ళినా మళ్ళీ తిరిగి రాలేం". అన్నాడు మాటీస్ కూడా.

" రావడమా? నాకైతే మళ్ళీ రావాలనే లేదు. మర్చిపోయారా? ఇక్కడి వాళ్ళందరూ మనల్నెంత తక్కువగా చూసేవారో. టు హెల్ విద్ ఆల్ దిస్ " అన్నాడతను.

" అలా అనకు! మనం ఇండియాలోని ఆంధ్ర ప్రదేశ్ అనే రాష్ట్రం నించి వచ్చాము అన్నది మాత్రమే మనకు తెల్సిన ది. అసలు అక్కడే పుట్టామో, లేదో కూడా తెలీదు. మన వాళ్ళకోసం ఎలా వెతుకుతాం ? ఇంకా చదువుకుంటున్న మనం అక్కడకు ఎలా వెళ్ళగలం? చెప్పు" అన్నాడు మాటీస్ నెమ్మదిగా.

" ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే మరో నలభై సంవత్సారలు ఇక్కడే గడిచిపోతాయి. మనసుంటే మార్గముంది, ఈ టెక్నాలజీ యుగంలో సాధ్యం కానిదేమైనా ఉందా? మీరు ఊ అంటే మనం న సమానంగా డబ్బులు వేసుకుని అన్ని విషయాలూ కనుక్కుని వెళ్ళిపోదాం. అన్నాడు గట్టిగా." ముందు కాస్త రీసెర్చ్ చేద్దాం" అంది రెనీ.

అలా మొదలయింది వారి ఆలోచన.

అప్పటినించీ ప్రత్యేకంగా ఈ విషయం కోసమే కలిసే సమావేశాల్లో తమ ఆంధ్రా ప్రయాణాన్ని గురించీ, తమ కుటుంబాలని ఎలా కనుక్కోవాలి? అన్న విషయాల గురించి మాత్రమే మాట్లాడుకుంటారు. ' వెనక్కి వెళ్ళిపోదాం, మళ్ళీ రావద్దు' అంటాడు నికోలస్.

" తమ దేశానికి తాము వెళ్ళిపోతాము అంటే తమలో ఎవరి తల్లి తండ్రులూ అడ్డుపెట్టరనే తన నమ్మకం . పెద్దవారయిన పిల్లల్ని ఎవరు మాత్రం శాసిస్తారు? దానికి వారికి తెలియకుండానో, గొడవ పెట్టుకుని వారి మనసును కష్టపెట్టో వెళ్ళవలసిన అవసరం ఏముంది?" అనుకుంటుంది తను. కానీ నిక్ అలా అనుకోడు. 'అంత కష్టపడి తీసుకొచ్చారు, వెళ్ళిపోతామంటే గొడవ పెడతారు. అందుకని ముందు చెప్పకుండా వెళ్ళిపోవడమే కరక్ట్ అంటాడు. 'ఉత్త ఆవేశం' అనుకుంది ఇంటి వైపు నడుస్తూ. అమ్మ ఇంకా రాలేదు, ఈ మధ్యన ఎందుకో ఆలస్యం అవుతోంది. మరో వారం తర్వాత మళ్ళీ అందరూ కలిశారు అదే పార్క్ లో.

" ఓకే ఫ్రెండ్స్, అవుట్ విత్ ఇట్. మీ రిసెర్చ్ ఫలితాలు ఏమిటి? ప్లాన్ ఏమిటి? అన్నాడు నికోలస్. "

ఆంధ్రా గురించి సేకరించిన వివరాలు, అక్కడకి వెళ్ళడానికి ఏం కావాలి? అక్కడ ఎక్కడుండాలి? ఎవరిని సంప్రదించాలి? ఎలాంటి ఉద్యోగావకాశాలుంటాయి లాంటి విషయాలన్నీ అందరూ ఒక్కొక్కరుగా చెప్పారు. " అన్నీ మనమనుకున్నట్టుగా జరిగితే, మరో రెండు నెలల్లో మనం మన మదర్ లాండ్ వైపు ప్రయాణం లో ఉంటాము అన్నాడు నికోలస్.

" నేను రావడం లేదు" అంది రెనీ చప్పున..

" వాట్" ముగ్గురూ ఒకేసారి అన్నారు దాదాపుగా.

"అవును" అంది రెనీ స్థిరంగా.

" బట్ వై" అన్నాడు మాటీస్.

"నాకు తెలుసు, ఈ అమ్మాయికి ఎప్పుడూ ఇష్టం లేదు మన ప్లాన్, లెట్ హర్ రాట్ హియర్. " అన్నాడు నికోలస్ కోపంగా.

" నీకక్కడ ఉండిపోవడం ఇష్టం లేకపోతే వెనక్కి వచ్చేద్దువుగాని. నేను కూడా వెనక్కి వచ్చేద్దామనే అనుకుంటున్నాను. నా కుటుంబాన్ని వదిలి ఉండడం నాకు ఈజీ కాదు" అంది నీనా.

" నీ కు ఈజీ కాదేమో, నాకు ఇంపాజిబిల్. నేను లేకపోతే అమ్మ ఒక్కర్తే ఉండాలి అన్న ఊహే నన్ను చిత్రవధ చేస్తోంది" అంది రెనీ బాధగా.

" రేపు నీ చదువయ్యాకైనా, పెళ్ళి తర్వాతైనా తను ఒంటరిగానే ఉండాలి కదా, దీంట్లో అంత పెద్ద విషయమేముంది?" ఈసారి అన్నది నికోలస్ కాదు మాటీస్.

" పెద్దవిషయమే ఉంది. నేను తప్ప మరొక తోడులేని అమ్మకి ఇప్పుడే నా అవసరం ఉంది. ఎందుకంటే తనకి కేన్సర్. బ్రెస్ట్ కేన్సర్ తో బాధపడుతూ కూడా, ఆ విషయం నాకు తెలియకుండా ఉంచాలని ఎంతో తాపత్రయ పడుతోంది. ఎంతో చిన్న వయసులో తీసుకుని వచ్చింది నన్ను, అప్పటినించీ ఎన్నో ఒడిదుడుకులు, కష్టాలు ఎదురైనా నా చెయ్యి ఎప్పుడూ వదలలేదు . ఈ రోజు వరకూ ఎప్పుడూ నా కోసమే బ్రతికింది చివరికి తన బాయ్ ఫ్రెండ్ " ఆ ఇండియన్ పిల్లని వదిలేయ్, అప్పుడే మన పెళ్ళి" అంటే అతని ముఖాన తలుపేసి 'గుడ్ బై' అంది కానీ అదే తలుపు తీసి నన్ను వీధిలోకి నెట్టలేదు. నాకు తెలియని నన్ను కన్న అమ్మ నాకు ఒక్కసారే జన్మని ఇచ్చింది, కానీ నేనెవరో తెలియకుండానే నన్ను తెచ్చుకున్న ఈ అమ్మ నా పేరు పెట్టినప్పటినించీ, ఎన్నోసార్లు మరుజన్మ నిచ్చింది, ఇస్తూనే ఉంది. నా అసలు తల్లి ఎవరో తెలుసుకోవాలని నాకూ ఉంది. కానీ ఆ సమయాన్ని, డబ్బునీ వాడవలసిన అవసరం ఇప్పుడు నా ముందుంది. అందుకని అమ్మకి బాగా నయమయ్యాకా, తనతో కలిసే వెళతాను నా అసలు అమ్మని చూడడానికి" అంది రెనీ. ఆమె కళ్ళల్లోని స్థిరత్వానికి భయపడి ఆ కనుకొలకుల్లోనే ఆగిపోయింది ఓ కన్నీటి చుక్క.

Click here to share your comments on this story